మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## లారీల్లోనుంచి ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలి

**-రైస్‌మిల్లు యజమానులకు ఆర్‌డిఓ సూచన**

**కొల్చారం, ఏప్రిల్ 28, (ప్రభాతవార్త):** రైస్ మిల్లులకు వరి ధాన్యంతో చేరుకున్న లారీల్లో నుంచి రైస్ మిల్లు యజమానులు త్వరిత గతిన అన్‌లోడ్ చేసుకోవాలని ఆర్‌డిఓ మహిపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన గల సత్యసాయి బైల్డ్ రైస్ మిల్లును తహసీల్దార్ గఫార్‌మియాతో కలిసి ఆర్‌డిఓ మహిపాల్‌రెడ్డి సందర్శించారు. రైస్ మిల్లులోని గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లు యజమాని శ్రీనివాస్‌గుప్తాతో ఆర్‌డిఓ మాట్లాడుతూ హమాలిల సంఖ్య పంపకుని వరి ధాన్యాన్ని త్వరగా లారీల నుంచి దింపుకోవాలని సూచించారు. లారీల నుంచి వరి ధాన్యం ఖాళీ చేసుకోకపోతే అకాల వర్షాలకు లారీల్లోని వరి ధాన్యం తడిసిపోతాయని, రైతులు ఆర్థికంగా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని గుర్తు చేశారు. ఆర్‌డిఓ వెంట ఆర్‌ఐ ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది నీరుడి శేఖర్ తదితరులు ఉన్నారు.

## ఎంఈఓ నీలకంఠంకు ఆత్మీయ వీడ్కోలు

**కొల్చారం, ఏప్రిల్ 28, (ప్రభాతవార్త):** మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన నీలకంఠం పదవీ విరమణ పొందడంతో సోమవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి గతంలో నీలకంఠం విధులు నిర్వహించిన 9 మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులతో పాటు కొల్చారం మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొని నీలకంఠంను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండల కో-ఆర్డినేటర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో నీలకంఠం అంకిత భావంతో విధులు నిర్వహించి ఉపాధ్యాయుల, విద్యార్థుల అభిమానాన్ని అందుకున్నారని గుర్తు చేశారు. 9 మండలాల విద్యాధికారిగా, జిల్లా పరీక్ష విభాగం సెక్రటరీగా సేవలు అందించి జిల్లా, రాష్ట్ర అధికారుల మన్ననలు అందుకున్నారని నీలకంఠం సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందినా విద్యా ప్రమాణాల మెరుగుకు నీలకంఠం అవసరమైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజశేఖర్, సీఆర్పీలు సాయికుమార్, రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

## ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ నప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. నప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

యూజీ నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బంధీగా చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశం లో ఆమె మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు అవ కాశం ఇవ్వకుండా యూజీ నీట్ పరీక్షలు సమర్థవం తంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయం తో పనిచేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళా శాల, బాలికల ఉన్నత పాఠశాల 2 కేంద్రంలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పరీక్ష నిర్వ హణకు అధికారులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల లో తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలన్నారు.అలాగే గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు.పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. మే 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రా లలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధించడం జరిగి దని పేర్కొన్నారు. అధికారులకు ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీనంబరు 08457-230000 ఫోన్ చేయా లన్నారు. మే 4 నిర్వహించనున్న యూజీ నీట్ పరీక్ష నిర్వహణపై తగు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు డిసిపి సుభాష్‌చంద్రబోస్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ సూర్యప్రకాష్, ఆర్డీఓ సదానందం, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## 4 నుంచి వాలీబాల్ కబడ్డీ టోర్నమెంట్



వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ ఇంద్రనగర్ గద్దర్ సర్కిల్‌వద్ద అమృత సత్తయ్య కొల్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 4,5 తారీఖులలో వాలీబాల్, 6,7,8వ తేదీలలో కబడ్డీ టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ తెలిపారు. సోమవారం టోర్నమెంట్‌లకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ వాలీబాల్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు 99వేల 999రూపాయలను, రెండవ స్థానంతో సరిపెట్టుకున్న జట్టుకు 55వేల 555రూపాయలను, కబడ్డీ పోటీలో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు 99వేల 999రూపాయలను, రెండవ స్థానంలో ఉన్న జట్టుకు 55వేల 555 రూపాయలను, మూడవ స్థానం దక్కించుకున్న జట్టుకు 33వేల 333రూపాయలను బహుమతిగా అందచేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు టౌర్నమెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని భరత్ సూచించారు.

## పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేష్ విడుదల

**పాపన్నపేట్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ఏడుపాయల పాలక మండలి ఏర్పాటుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఇఒ చంద్రశేఖర్ వెల్లడించారు. ఈ నెల 24న రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ పాలక మండలి ఏర్పాటుకు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఉత్తర్వులు పంపడంతో ఆశావహులు 20 రోజులలోపు దరఖాస్తులను అసిస్టెంట్ కమిషనర్ కార్యా లయంలో సమర్పించాలని వారు కోరారు.

## అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

**కంగ్టి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** అపరిచితులతో అప్రమత్తంగా ఉండటంతో పాటు గుర్తు తెలియని నంబర్‌ల నుంచి వచ్చిన ఫోన్‌లకు, లింక్‌లపై స్పందించవద్దని హెడ్‌కానిస్టేబుల్ పండరి రాజ్‌కుమార్ అన్నారు. సోమవా రం కంగ్టిలోని కంగ్టి చౌరస్తా దెగుల్ వాడి రోడ్డు వద్ద సైబర్ నేరాళ్లపై ప్రజ లకు అవగాహన కల్పించారు. అపరిచితులకు ఓటిపి నంబర్లు చెప్పవద్దని, లక్షల్లో లాటరీ తగిలిందని, ఈ నెంర్‌కు రూపాయలు పంపాలని చరవాణికి మెస్సెజ్ వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# అధికారం కోల్పోయినా అహంకారం తగ్గని కెసిఆర్

**-దేశంలోనే చారిత్రాత్మకం భూభారతి చట్టం అమలు.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్**

**వర్గల్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త):**

రాష్ట్రంలో అధికారం కోల్పోయినా కెసిఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని, కడుపునిండా విషం నింపుకొని మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై చిమ్ముతున్నట్లు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు నిప్పులు చెరిగారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాకారం టిజిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన దేవత సోనియాగాంధీకి సాష్టాంగ ప్రణామం చేసిన కెసిఆర్ కాలం తిరగబడి ప్రజలు బుద్ధి చెప్పడంతో కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపిస్తున్నట్లు ఎద్దేవ చేశారు. రాష్ట్ర ఖజానాను నిండా ముంచిన ఆయన కనీసం గ్రామస్థాయి సర్పంచులకు కూడా బిల్లు ఇవ్వకపోగా, తప్పును తమపై నెట్టుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియంతలా వ్యవహరించిన కెసిఆర్ సొంత ఎమ్మెల్యేలను కూడా కలిసేందుకు ఒప్పుకోని ఆయన సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతులు ఆత్మగౌరవంతో బ్రతికేందుకే భూభారతి చట్టం తేగా, తమ అక్రమాలు బయట పడతాయనే వారు గగ్గోలు పెడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రూ.2 లక్షల రుణమాఫీ చేసినందుకా?



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నందుకా? రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నందుకా? పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నందుగా? నీ ఏడుపులు పెడబొబ్బలు అంటూ కెసిఆర్‌ను వారు ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన భూభారతి చట్టం రైతులకు వరంగా నిలుస్తుందని, ఏండ్ల తరబడిగా ఉన్న భూ సంబంధిత సమస్యలు పరిష్కారానికి నోచనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్, మాజీ కార్పోరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్, వంటిమామిడి, కొండపాక ఏఎంసి చైర్మన్‌లు వంటేరు నరేందర్‌రెడ్డి, విజయ మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ బాలరాజు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి గజ్వేల్ ప్రవీణ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వర్గల్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రభుదాస్‌గౌడ్, భానుప్రసాద్‌గౌడ్, గుండు నర్సింలు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోర్క నర్సింలు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో భూ ఆక్రమణలకు తావులేదు

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**

**గజ్వేల్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త):** పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులకు భూభారతితో పరిష్కారం అవుతాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఐఓసి కార్యాలయంలో రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూభారతి చట్టం-2025 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూభారతి చట్టంలోని వివిధ అంశాలను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ గతంలో భూ సమస్యలు ఎదుర్కొన్న విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మేధావులు, విశ్రాంతి అధికారులు, ప్రజలతో చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించి 2025 ఏప్రిల్ 14న భూభారతి చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. గతంలో సాదా బైనామా కింద దరఖాస్తు చేసుకున్న పెండింగ్‌లో ఉన్న సాధా బైనామాలు భూభారతి చట్టంలో పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూవ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్‌కార్డులాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చన్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించేలా కరపత్రాలను సైతం పంపిణీ చేశామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు. గతంలో ధరణి ఉన్నప్పుడు ఏదైనా సమస్య ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్ళాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులను తయారుచేసి ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్‌ప్లే చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, మండల ప్రత్యేకాధికారి సువర్ణ, తహసీల్దార్ శ్రావణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఏడి బాబునాయక్, ఏఓ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దేశానికే రోల్ మోడల్

**దేశంలో తీవ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి.. అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ**

**సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. సోమవారం హత్నూర మండలంలోని మంగపూర్ గ్రామంలోని ప్రైవేటు ఫంక్షన్‌లో భూ భారతి అవగాహన సదస్సుకు, అటవీ,దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపి రఘునందన్‌రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీ ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరులతో కలసి పాల్గొన్నారు. దేశంలో తీవ్రవాదుల దాడికి నిరసనగా రెండు నిముషాల సమయం మౌనం పాటించారు. జ్యోతి ప్రజ్వలనచేసి భూభారతి చట్టం అవగాహన సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేశంలో తీవ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించలన్నారు. తీవ్ర వాదుల దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. దేశంలో తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వనికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందని అన్నారు.త్వరలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని అన్నారు. భూభారతి దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీతకాలంలో విచారణచేయాలని, భూమి హక్కులు మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదుకు, పాసు పుస్తకాలలో భూమి పటం ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు.భూ సమస్యల పరిష్కారనికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, వ్యక్తికి ఆధార్ భూమికి భూధార్ కార్డుల జారీ చేస్తున్నట్లు చట్టంలో ఉందని తెలిపారు. ఇంటిస్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం ,గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారన్నీ కూడా పొందుపరిచారని, రికార్డులో తప్పుల సవరణకు ,హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు కూడా అవకాశం ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. భూ భారతి చట్టంలో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించి, భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు.దేశంలో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిలో 3 కోట్ల వరకు భూ సంబంధిత కేసులే ఉన్నాయన్నారు. భూ రికార్డులు డిజిటల్‌గా మార్చాలని, భూ భూధార్‌లాంటివి గతంలో కేంద్ర ప్రభ్నుత్వ నిర్ణయించినా అప్పటి ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు. గ్రామా ల్లో ఉన్న గ్రామ కంఠం, అభది భూముల సర్వే జరగాలన్నారు. టిజిఐఐ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి,అదనపు కలెక్టర్ మాధురి,ఆర్ డి ఓ రవీందర్‌రెడ్డి, తాసిల్దార్ పర్వీన్‌షేక్, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



వాంగ్దాల్ గైరాన్ తండాను సందర్శిస్తున్న ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి

## వాంగ్దాల్ గౌరాన్ తండాను సందర్శించిన ఆర్‌డిఓ

**సిర్గాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వాంగ్దల్ గైరాన్ తండాను సోమవారం ఆర్‌డిఓ అశోక్‌చక్రవర్తి, తహసీల్దార్ అబ్దుల్ నజీంఖాన్, ఆర్‌ఐ మదన్‌తో కలిసి సందర్శించారు. తండాకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం, వాగుపై వంతెన నిర్మించాలని తండావాసులు ఉన్నతాధికారులకు విన్నవించుకోగా స్పందించిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు సోమవారం ఆర్‌డిఓ తండాను సందర్శించి తండా వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండా పరిస్థితులు, కావాల్సిన మౌలిక సౌకర్యాలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందేస్తామని ఆర్‌డిఓ అశోక్‌చక్రవర్తి, తహసీల్దార్ అబ్దుల్ నజీంఖాన్‌లు తెలిపారు.

## విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సజీవరెడ్డి

**మనూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** విధి నిర్వాహణలో చేసిన సేవలే కలకాలం గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన దారం వివేకానంద్‌కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ వివేకానంద క్రమశిక్షణకు మారుపేరుగా పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యే అధికారి రాఘుబాబు,ఎంపిడిఓలు శాజులోద్దిన్, హైమద్ హుస్సేన్, మాజీ ఎంపిపి అధ్యక్షురాలు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వంటావార్పుతో ఒప్పంద అధ్యాపకులు నిరసన



వంటవార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు

**చౌటకూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** న్యాయమైన డిమాండ్ సాధనకు మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్యాపకులు చేపడుతున్న నిరవధిక సమ్మె సోమవారంతో 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంంగా సోమవారం ఒప్పంద అధ్యాపకులు వంటా వార్పు చేసి సామూహిక భోజనాలు చేసిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న 1200 మంది ఒప్పంద అధ్యాపకులను క్రమబద్దీకరించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాన్ని ఉదృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. శ్రమ దోపడికి గురవుతున్న తమకు న్యాయం చేయా ల్సిన అసవరం ఉందని గుర్తుచేశారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పాల్సిన తాము మండుటెండల్లో రోడ్లపై టెంట్లు వేసిన నిరసన వ్యక్తం చేస్తున్నా, చాక్‌పీసులు పట్టుకోవాల్సిన చేతుల్లో ప్లకార్డులు పట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబాట్టారు.

## గాలి దుమారానికి నేలరాలిన మామిడి



నేల రాలిన మామిడి కాయలు

**సిర్గాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ప్రకృతి వైపరీత్యం కారణంగా మామిడిపంట నేలరాలింది. ఇటీవల గాలిదుమారంతో కూడిన వడగండ్ల వర్షానికి రైతులు సాగు చేసుకుంటున్న పంటలు నీటిపాలుకాగా, పండు దశలో ఉన్న మామిడి కాయలు నేలరాలినట్లు మండల పరిధిలని వాసర్ గ్రామానికి చెందిన రైతు జైపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి తోటలపై అనేక మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారని, ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలయని, రైతులు పరిస్థితి దయనీయంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని వినతి చేశారు.

## ఎస్ఐ శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయం

**మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**

**నర్సాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. ఆదివారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై 2గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ పదవి విరమణ సందర్భంగా సాయికృష్ణ గార్డెన్‌లో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ బి.లింగం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ ఎస్సై శ్రీనివాస్ పదవి విరమణ పొందిన తర్వాత కూడా ప్రజలకు సేవలు అందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాల న్నారు. ఎస్సై శ్రీనివాస్ దంపతులకు జ్ఞాపికను అందించి శాలువాలతో పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూశంకరాచారి

## బాధితులకు ఎలాంటి నష్టపరిహారం అందించారు ?

### నాలుగువారాల్లో నివేదిక పంపాలని కలెక్టర్‌ను కోరిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఉపాధి హామీ కూలీకి వెళ్లిన తల్లి కూతుళ్లు మృతిచెందగా మరో మహిళ కాలును కోల్పోయిన విషయం లో బాధితులకు ప్రభుత్వం ఎలాంటి పరిహారం అందించిందో నాలుగు వారాలలో కలెక్టర్ నివేదిక అందించాలని కోరుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఎన్‌జివో నేషనల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు కోరినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోట భూశంకరాచారి తెలిపారు. సోమవారం వారు సంఘం ప్రతినిధులతో కలసి మాట్లాడుతూ గతంలో సంఘం తరుపున బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆర్డీవోతోపాటు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశామని, అయితే ఇప్పటివరకు వారికి ఎలాంటి సహకారం ప్రభుత్వం నుండి అందలేదనే సమాచారం మేరకు సంఘం ప్రధాన కార్యాలయం నుండి కలెక్టర్‌ను వివరణ కోరినట్లు వివరించారు. ఇప్పటికైనా బాధితులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉనికిని కాపాడుకునేందుకు వరంగల్ సభ

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు


మాట్లాడుతున్న అత్తు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** వరంగల్‌లో బిఆర్‌ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకే సభ నిర్వహించారని...తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్‌పార్టీని విమర్శించడం కెసిఆర్‌కు తగదని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనియాగాంధీ ఇవ్వకుంటే నేటికీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా కెసిఆర్ వ్యాఖ్యాలు చేశారని తెలిపారు. సభలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. తెలంగాణ ఏమి ఆగం కాలేదని అధికారం కోల్పోవడంతో కెసిఆర్ కుటుంబ ఆగమైందన్నారు. బిఆర్‌ఎస్‌పార్టీని ప్రజలు నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగానే ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, హర్షద్,రాజురెడ్డి, మాజీద్, దుర్గప్రసాద్, రవితేజ తదితరులు ఉన్నారు.

## ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం


మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** ఎన్ని అటంకాలు సృష్టించినా.. మొక్కవోని దీక్షతో సభా ప్రాంగణం చేరుకొని బిఆర్‌ఎస్ రజతోత్సవ సభను కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు విజయవంతం చేశారని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ ఎఎంసి చైర్మన్ సాయిరాం, పార్టీ నాయకులు గుండు భూపేష్ అన్నారు.జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ, సిద్దిపేట నియోజకవర్గం తోపాటు మారుమూల పల్లె నుంచి హరీశ్‌రావు మార్గదర్శకాలతో బహిరంగ సభకు భారీగా తరలివచ్చారని అన్నారు. 16 నెలలలోపే కాంగ్రెస్ సర్కారు ప్రజల ఆగ్రహానికి గురైందన్నారు. రాబోయే రోజుల్లో తిరిగి బిఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, కెసిఆర్ సిఎం అవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, నాయకులు సాయన్నగారి సుందర్, మోహిజ్, కనకరాజు, ఇర్షాద్‌హుస్సేన్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి

## సమ్మర్ క్యాంపు దోహదం : ఎంఇవో బచ్చలి సత్తయ్య


సమ్మర్ క్యాంపులో చిత్రలేఖనం నేర్పిస్తున్న దృశ్యం

**కొండపాక, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి సమ్మర్ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈఒ సత్తయ్య అన్నారు. సోమవారం కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంపును ఆయన ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి, కనీస సామర్థ్యాలు నేర్పించడానికి అటపాటలతో విద్యను అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ క్యాంపులో పాటలు, చిత్రలేఖనం, కరాటే, నృత్యపోటీలు, గణితం, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి వాటి లో విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశానిన సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం కూరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్రం, నాగరాణి, స్వరూపరాణి, శంకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ దృష్టికి ఆర్‌పి అవినీతి బాగోతం

**గజ్వేల్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త):** వారం పది రోజుల నుండి గజ్వేల్ పట్టణంలోని ఆర్‌పి కృష్ణలీల మరియు కర్ణాల మంజుల చేసిన అవినీతి బాగోతాన్ని జిల్లా కలెక్టర్ మనుచౌదరి దృష్టికి శివశంకర్, నెహ్రూ మహిళా గ్రూపుల సభ్యులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన ఆయా మహిళా గ్రూపుల సభ్యులు మాట్లాడుతూ ఆర్‌పి కృష్ణలీల, మంజుల చేసిన మోసంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపుల సభ్యులు అనసూయ, బాలమణి, మౌనిక, రాజన్న, షాహిద్, స్రవంతి, శ్రీలత, స్వప్న, స్వాతి, శివాని తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అంద జేస్తున్న మహిళా గ్రూపు సభ్యులు

# కాంగ్రెస్‌పై కెసిఆర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

### జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బిఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యలు చేసిన కెసిఆర్ వెనక్కి తీసుకోవాలని సిద్దిపేట జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి,సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్యలు డిమాండ్ చేశారు.సోమవారం రోజున కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పార్టీ నాయకులతో కలసి ఆందోళన నిర్వహించారు.అనంతరం తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ కాంగ్రెస్‌ను విమర్శించేందుకే నిర్వహించారని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ పార్టీ,సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ ఏర్పాటు అయ్యేదికాదన్నారు.కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో గౌరవెల్లి ప్రాజెక్టు కుర్చీ వేసుకుని పూర్తి చేస్తానని చెప్పి 10 ఏండ్లు పూర్తి చేయకుండా కాలయాపన ఎందుకు చేశారో ప్రజలకు సమాదానం చెప్పాలన్నారు.గౌరవెల్లికి సంబందించి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణానికి భూములు సేకరణ చేస్తుంటే అవగాహన లేకుండా మట్లాడడం సమంజసం కాదన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బంక చందు, పార్టీ నాయకులు చిత్తారి రవిందర్, వెన్న రాజు,పున్న సది,తరాల మహేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.


సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



చిల్వర్ జడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## చిల్వర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అల్లాదుర్గం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిల్వర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003న04 విద్యా సంవత్సరంలో 10వ తరగతిని పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. 10వ తరగతి పూర్తి చేసుకుని వివిధరంగాల్లో స్థిరపడ్డ విద్యార్థులు 21 సంవత్సరాల తరువాత ఒక చోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరుసుకుంటూ వారి వారి కుటుంబ విషయాలపై కులాసాగా చర్చించుకుని రోజులు జాలీగా గడిపారు. నాడు విద్యాబుద్దులు చెప్పిన ఉపాధ్యాయులను ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ధనుంజయ, కచ్చిరావు, మధు, ప్రభాకర్, విజయ్‌భాస్కర్, ప్రవీణ్‌కుమార్, అశోక్, శేఖర్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవి దుక్కులతో రైతులకు లాభం

### ఎవో రాజ్‌నారాయణ

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** వేసవి దుక్కుల తో రైతుకు ఎంతో లాభం చేకూరుతుందని రామాయంపేట మండల వ్యవసాయఅధికారి రాజ్‌నారాయణ తెలిపారు.ఆయన సోమవారం మాట్లా డుతూ.. అకాల వర్షాలను సద్వినియోగం చేసుకొని వేసవి దుక్కులు చేయ డం ద్వారా పంటకు నష్టం చేకూరే చీడపీడలు తొలగిపోతాయన్నారు. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు పెరిగి లాభం చేకూరుతుందని, రసా యన ఎరువుల వాడకం తగ్గి రైతుకు లాభం చేకూరడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని తెలిపారు.

## పట్టపగలు ఊరిలోకి చొరబడిన అడవి పందులు

**నిజాంపేట, ఏప్రిల్ 28 ప్రభుతవార్త :** నారాయణఖే, నిజాంపేట్ మండలంలోని రామ్ రెడ్డి పేట గ్రామంలోకిలో మధ్యాహ్నం సమయంలో పట్టపగలు అడవి పందులు ఊర్లోకి ఒక శ్రామికుడు ఇంటిలోకి వచ్చాయి ఆ కుటుంబ సభ్యుల అరుపులు కేకలు పెట్టడంతో చుట్టుపక్కల ప్రజలు వచ్చి వాటిని చెదర గొట్టే ప్రయత్నంచేశారు. అవి పారిపోయాయి భయోందులకు గురి అయ్యారు ఇలాంటి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా అడివి అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గిట్టుబాటు ధర కోసమే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

### పిఏసిఎస్ చైర్మన్ భాదే చంద్రం

**రామాయంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** పట్టణంలోని దళితవాడలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పిఏసిఎస్ చైర్మన్ భాదే చంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నదాతలు పండించిన పంట కు రైతులకు క్వింటాలకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించిందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల పండించిన ధాన్యం దళారులకు విక్రయించవద్దని సూచించారు.


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ చంద్రం


హుండీని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది తదితరులు

## ఏడుపాయల ఆలయ హుండీ ఆదాయం రూ.46 లక్షలు

**పాపన్నపేట్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గ భవాని దేవి ఆలయ హుండీ ఆదాయం రూ. 46,08,354 దేవాదాయ ధర్మా దాయ శాఖ రాంగోపాల్ ట్రస్ట్ ఇఒ, అసిస్టెంట్ కమిషనర్ సులోచన, ఆలయ ఇన్‌చార్జి ఇఒ చంద్రశేఖర్ వెల్లడించారు. సోమవారం 58 రోజుల హుండీ లెక్కింపు కార్యక్రమం రాజరాజేశ్వరి సేవా సమితి అధ్వర్యంలో గోకుల్ షెడ్ లో నిర్వహించగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రత్యేక అధికారి అసిస్టెంట్ కమిషనర్ సులోచన పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ చేపట్టగా బంగారు, వెండి వస్తువుల మినహా నగదు రూపంలో 46 లక్షల 8వేల మూడువందల యాభైనాలుగురూపాయల ఆదాయం ఏడుపాయల దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఆదాయం సమకురినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్యామ్, శ్రీనివాస్ శర్మ, రాజు, రవి, యాదగిరితోపాటు రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొనగా పాపన్న పేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రామచంద్రాపురంలోని బీహెచ్ఈఎల్‌లో సోమవారం పనివద్ద భద్రత, ఆరోగ్య ప్రపంచ దినోత్స వాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు అవగాహన పెంచడం, సానుకూల భద్రత, ఆరోగ్య సంస్కృతిని పెంపొందించడం కార్యక్రమం ఉద్దేశమని హెచ్‌పిఈపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి రాజు, వై.శ్రీనివాస్‌రావు, ఎస్.విజయసాగర్ పేర్కొన్నారు. భద్రతా ప్రోటోకాల్‌లను పాటించడం, కార్యాలయ భద్రతా చర్యలు, సురక్షితమైన పని పద్ధతులు, పిపిఈల వినియోగానికి అనుగుణంగా ఉండేలా చూసుకో వాల్సి జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో (నినాదం, వ్యాస రచన, పోస్టర్ తయారీ, హౌజ్ కీపింగ్ పోటీలు) ప్రతిభ చాటిని వారికి జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో చీఫ్ సేఫ్టీ అధికారి కె.అరవింద్‌కుమార్, సేఫ్టీ అధికారు బి.పరశురామ్, టి.హరీష్ బాబు, బాలకృష్ణ సైని తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో సోలార్ లైట్ల ఏర్పాటు

**నర్సాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ పరిధి లోని శ్రీఆదిలక్ష్మినారాయణ దేవాలయంలో, కాలువగట్టు హనుమాన్ ఆల యంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రాధామల్లేష్‌గౌడ్ చొరవతో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నిధులతో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఆలయాల్లో లైట్లు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులుపడేవారు. ఇది గమనించిన రాధామల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీ నిధులతో సోలార్‌లైట్‌ల ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావుకు జిల్లా అధ్యక్షుడు రాధా మల్లేష్‌గౌడ్ కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సంఘసాని రాజు, బాలరాజు, సంగమేశ్వర్, జీడిమెట్ల బాలరాజు, మహేందర్‌గౌడ్, దుద్దాల సంతోష్ కుమార్, సదానందంచారి, శ్రీధర్, పూర్ణచందర్, శ్యామ్, దుర్గాప్రసాద్, సతీష్, ప్రదీప్, స్వామి తదితరులు పాల్గొన్నారు

## లయన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు

**రామాయంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ రామాయంపేట చార్టర్ సభ్యుడిగా 35సంవత్సరాలుగా ఆర్తులకు సేవలందిస్తున్న డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు లభించింది. రెండున్నర దశాబ్దాలుగా రక్త, అవయవ దానాలకు కృషిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డికి లయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు లయన్ ఫిబ్రయిషియో అలివేరా అభినందిస్తూ ..లయన్స్ అత్యంత ప్రతిష్ఠాకరమైన ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లీడర్షిప్ మెడల్‌ను అందజేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జి.బాబురావు కానిస్టిట్యూషనల్ ఏరియా లీడర్ ఆర్ సునీల్‌కుమార్ అభినందిస్తూ ఆదివారం సాయంత్రం హైదరాబాదు, శామీర్‌పేటలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్రంలోని 8 లైన్స్ జిల్లాల నుండి లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. మల్టీకాన్ కన్వెన్షన్‌లో అవార్డును ప్రదానం చేశారు. కాగా రాజశేఖర్‌రెడ్డి 54 మార్లు రక్తదానం చేయడమేగాక రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, అవయవదానంపై విస్తృత ప్రచారం చేసేవారు. ఈ కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ హనుమాన్ల రాజారెడ్డి, గవర్నర్ లయన్‌నగేష్ పంపాటి, లయన్ ఏ. అమర్నాథ్‌రావు, లయన్ ఎమ్.విజయలక్ష్మి ౣ, లయన్స్ క్లబ్ రామాయంపేట, రెడ్‌క్రాస్ మెదక్ సభ్యులు పాల్గొన్నారు.

# సమాజంలో వైద్య విద్యకు మంచి భవిష్యత్తు

### కెఎన్‌ఆర్ యుహెచ్‌ఎస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త):** సమాజంలో అత్యంత ఆదరణ కలిగిన వైద్య విద్యకు మంచి భవిష్యత్తు ఉండగా, ప్రపంచంలో మరణం లేనిది విద్య,వైద్యం మాత్రమేనని కెఎన్‌ఆర్ యుహెచ్‌ఎస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా వంటిమామిడి పరిధిలోని లక్ష్మక్కపల్లి ఆర్‌విఎం మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ యాకయ్య అధ్యక్షతన జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో గ్రామీణ పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చక్కని సేవలందిస్తే సమాజంలో గౌరవం గుర్తింపు దక్కుతుందన్నారు. ఆధునిక అభ్యసన విధానాలపై విద్య, వైద్యం ఆధారపడి ఉందని, అమెరికా లాంటి శిక్షకులు, చక్కటి వసతులు, బోధన, నైపుణ్యత కలిగిన ఆర్‌విఎం మెడికల్ కళాశాల అగ్రశ్రేణి వైద్యులుగా తీర్చి దిద్దుతున్న ఘనత దక్కించుకున్నట్లు తెలిపారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎంపి డాక్టర్ రంజిత్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న కెఎన్‌ఆర్ యుహెచ్‌ఎస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి

## రామచంద్రం మృతి ప్రజలకు తీరని లోటు

### మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మాజీ జడ్పిటిసి, సీనియర్ న్యాయవాది కన్నోజు రామచంద్రం ఆకస్మిక మృతి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు అని హుస్నాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, బిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి అన్నారు. సోమవారం మృతుడి కుటుంబసభ్యులను కలిసి వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతికిగల కారణాలు అడిగి తెలుసుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు గాల్‌రెడ్డి, కన్నోజు రామకృష్ణ, పాకాల శ్యాంసుందర్‌గౌడ్, మేకల వికాస్‌యాదవ్, గోపగోని అరవింద్ పాల్గొన్నారు.

## ఉప్పల మెట్టయ్యను పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య మాతృమూర్తి ఉప్పల తారబాయి ఇటీవల మృతి చెందారు. సోమవారం పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించగా మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి పాల్గొని తారాబాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, నంగునూరి సత్య నారాయణ, కొమురవెల్లి సుధాకర్, అయిత సత్యనారాయణ, లయన్ మల్లేశంగౌడ్, కైలాస ప్రభాకర్, దొంతుల సత్యనారాయణ, ఆదిమూలం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

**గజ్వేల్, ఏప్రిల్ 28(ప్రభాతవార్త):** పట్టణంలో స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించినట్లు కళాశాల అల్యూమిని కమిటీ కన్వీనర్ కెప్టెన్ డాక్టర్ భవాని తెలిపారు. కళాశాల అల్యూమిని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సర్దార్‌ఖాన్, జాయింట్ సెక్రటరీ నర్సింలు, కోశాధికారి గుంటుకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యతని, వాటి ఆవశ్యకతని, కళాశాల ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ ప్రస్తుతం కళాశాలలో గల విషయాలను సంఘ సభ్యులకు వివరించారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించినందున విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని తీర్మాణించుకోవడం జరిగింది. పూర్వ విద్యార్థుల సంఘ కార్యక్రమం నిర్వహించుకోవడానికి కళాశాలలో ఒక గదిని కేటాయించినందుకు కళాశాల ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి 50 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ పెద్దిరాజు, పూర్వ విద్యార్థులు డాక్టర్ నరేష్, లావణ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చాట్లపల్లిలో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్న పూర్వ విద్యార్థులు

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-10 విద్యాసంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు సోమవారం తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు అంతా తిరిగి ఈరోజు కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, పాఠశాల దశలో వారు చేసిన చిలిపి పనులు, ఆడిపాడిన ఆటలను నెమరువేసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను గుర్తుంచుకొని వారికి శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 2009-10 విద్యాసంవత్సరం విద్యార్థులు కళ్యాణి, మమత, పవిత్ర, శ్యామల, కళ్యాణి, సంధ్య, రాజు, ఎం.ప్రకాష్, ఈదులు, కృష్ణ, రమేష్,నాగరాజు, సిహెచ్.శ్రీను, ప్రశాంత్,పర్శ రాములు, గడ్డం రాజు, కృష్ణ, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, సత్యనారాయణ, నగేష్, బాలకృష్ణారెడ్డి, నర్సింలు, బాపురెడ్డి, దేశాయిరెడ్డి, మల్లేశం, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ విజయవంతం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 28, ప్రభావతవార్త:** ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతంగా ముగిసిందని పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఎల్కతుర్తి సభ విజయవంతంగానికి నియోజకవర్గంలోని రామచంద్రాపురం భారతీ నగర్, పటాన్‌చెరు డివిజన్, తెల్లాపూర్, అమీన్‌పూర్ బొల్లారం మున్సిపాలిటీలు, జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన బిఆర్‌ఎస్ శ్రేణులకు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

### ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆనంద్

**నారాయణఖేడ్ ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎన్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మేడే ఉత్సవాలను అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వంట వార్పు నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. నాటినుండి నేటి వరకి కార్మికులకు అండగా ఏఐటీయూసీ ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి దత్తురెడ్డి అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆనంద్

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

**వర్గల్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం తునికిమక్త గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త చాకలి కనకయ్య(36) ఆ పార్టీ రజతోత్సవ సభకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురయ్యాడు. మిత్రులతోకలిసి బస్సులో రజతోత్సవ సభకు వెళ్లి తిరిగి వస్తుండ గా హుస్నాబాద్ వద్ద తాగునీటి కోసం బస్సు దిగడంతో వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. దీంతో కనకయ్య కాలు విరగడంతోపాటు తీవ్ర గాయాలకు గురయ్యాడు. అక్కడే ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సంతోష వెంకటేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సహాయం అందేలా చూస్తామని తెలిపారు.

